క్లుప్తంగా

క్రీడా పురస్కారం అందుకున్న ఏఎంజీ విద్యాసంస్థలు

చిలకలూరిపేటటౌన్: జాతీయ క్రీడా దినోత్స వాన్ని పురస్కరించుకొని 2022–23 విద్యాసంవత్సరం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడాపోటీల్లో ఏఎంజీ పాఠశాల రాష్ట్ర స్థాయిలో మూడో స్థానం , జిల్లా స్థాయిలో మొదటి స్థానం సాధించినట్లు ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ మహంతి చెప్పారు. బుధవారం స్కూల్ ఆవరణలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం క్రీడా ప్రతిభా అవార్డులను వివిధ క్రీడాపోటీల్లో ప్రతిభ కనపరిచిన పాఠశాలలకు అందజేయడం జరుగుతుందన్నారు పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంజీ సీఏవో మాశిలామణి, వ్యాయమ ఉపాధ్యాయులు కె రాజు, రాజేష్ పాల్గొన్నారు.

పే-స్కేలు అమలు చేయాలి



నరసరావుపేట: వీఆర్ఏలకు పే స్కేలు అమలు చేయాలని, అర్హత గల వీఆర్ఏలకు వీఆర్వోలుగా ప్రమోషన్లు ఇవ్వాలని వీఆర్ఏలు కోరారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా తాము తలపెట్టిన కార్యక్రమానికి పాల్గొనేందుకు వెళుతున్న వీఆర్ఏల అరెస్టును ఖండిస్తూ బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసి జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాదుకు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ నామినీలుగా పనిచేస్తున్న వారిని వీఆర్ఏలుగా గుర్తించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ వీఆర్ఏలకు వర్తింప చేయాలన్నారు. మా సమస్యలు పరిష్కారం చేయకుండా నిర్లక్ష్యం వహిస్తే రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించి హక్కుల కోసం పోరాడి, సాధించి తీరుతామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు షేక్ బందగీ సాహెబ్, సత్తెనపల్లి డివిజన్ కార్యదర్శి సుబ్బారావు, నరసరావుపేట, చిలకలూరిపేట, రొంపిచర్ల, నకరికల్లు, దాచేపల్లి మండల అధ్యక్షులు రోశయ్య, ఆనంద్, నాగేశ్వరరావు, షేక్ కాసులు, షేక్ ముస్తఫా, వివిధ మండలాల ముఖ్య నాయకులు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలి



నరసరావుపేట టౌన్: ట్రాఫిక్ నియంత్రణకు వ్యాపారులు సహకరించాలని డీఎస్పీ కె.వి.వి. మహేష్ అన్నారు. బుధవారం అరండల్‌పేటలోని పలు ప్రధాన రహదారులను ఆయన పరిశీలించారు. ముఖ్యంగా బ్యాంకుల వద్ద సెల్లార్ పార్కింగ్ లేకపోవటంతో ద్విచక్ర వాహనాలను నడిరోడ్లపై నిలుపుతున్నారన్నారు. దీంతో ఆయా మార్గాల్లో రాకపోకలకు తీవ్ర అంతరాయం కల్గుతుందన్నారు. ఇకపై రోడ్డుకు ఒకవైపు ద్విచక్ర వాహనాలు నిలుపుకునే విధంగా మార్కింగ్ ఇస్తామన్నారు. నిర్దేశించిన ప్రదేశాల్లో మాత్రమే వాహనాలు నిలుపుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే మొదట జరిమాన, రెండవసారి వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. పల్నాడు జిల్లా కేంద్రంగా నరసరావుపేట అవతరించినప్పటి నుంచి అనేక జిల్లా కార్యాలయాలు పట్టణంలో ఏర్పాటు అయ్యాయన్నారు. సేవల కోసం పలు ప్రాంతాల నుంచి వచ్చే ప్రజానీకంతో పట్టణంలో ట్రాఫిక్ రద్దీ పెరిగిందన్నారు. వాహనదారులు, భవన యజమానులు ట్రాఫిక్ నియంత్రణలో తమవంతు సహకారం అందించాలని కోరారు. డీఎస్పీ వెంట వన్‌టౌన్, టూటౌన్ సీఐలు అశోక్ కుమార్, వీరేంద్రబాబు, ట్రాఫిక్ సీఐ రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారి పర్యటన

వినుకొండ(నూజెండ్ల): ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు మండలంలోని అన్ని గ్రామాల్లో త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి బోయపాటి రవిబాబు అన్నారు. వి.అప్పాపురం గ్రామంలో జగనన్న కాలనీలోని ఇళ్ల నిర్మాణం, జగనన్న పాలవెల్లువ, ఈనాంభూముల సర్వే, పాఠశాలలో నాడు-నేడు పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామసచివాలయంలో అధికారులతో మాట్లాడుతూ కౌలుకు సాగు చేసే రైతులకు పంట సాగు హక్కు పత్రాలు మంజూరు చేసి, కౌలు రైతులను గ్రూపులుగా ఏర్పాటు చేసి బ్యాంక్ నుండి పంట రుణం ఇప్పించేందుకు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి షేక్ సుగుణా బేగం, హౌసింగ్ ఏఈ, ఎంపీటీసీ జి.సుభాషిణి, ఏఈవో ఎల్.ఎలీషా, పంచాయతీ కార్యదర్శి జానీబాషా, గ్రామ వ్యవసాయ సహాయకులు పి.అశోక్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వి.తిరుపతిరావు, రోశిరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నరసరావుపేట రూరల్: మండలంలోని చిలకలూరిపేట రోడ్డు లలితానగర్ కాలనీ వద్ద బుధవారం సాయంత్రం గుర్తుతెలియని వాహనం ఢీకొని నాదెండ్ల మండలం మల్లాయపాలెంకు చెందిన కట్టారాయన్న (50) మృతిచెందాడు. టీవీఎస్ మోపెడ్‌పై వెళుతున్న రాయన్నను గుర్తుతెలియని వాహనం ఢీకొనటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కార్పెంటర్‌గా పని చేస్తున్నట్లు తెలియవచ్చింది. అతడికి భార్య, పిల్లలు ఉన్నారు. ఈ మేరకు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆరంభం నేడు



ఈపూరు మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఎంపీడీవో కార్యాలయ భవనాన్ని గురువారం ప్రారంభించనున్నారు. సుమారు రూ.80 లక్షల నిధులతో నిర్మించిన ఈ భవనాన్ని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, జిల్లా పరిషత్ చైర్మన్ హెన్రీ క్రిస్టినాలు ప్రారంభిస్తారని ఎంపీడీవో రంగనాయకులు తెలిపారు. తొలుత ఇనిమెళ్లలో సచివాలయాన్ని, బొమ్మరాజుపల్లిలోని సచివాలయాన్ని, రైతు భరోసా కేంద్రానికి ప్రారంభిస్తారని ఆయన పేర్కొన్నారు. –ఈపూరు

క్యాడెట్లకు సర్టిఫికెట్లు



గణపవరం కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం రెండేళ్లపాటూ ఎన్‌సీసీ శిక్షణ పూర్తి చేసుకుని రాత పరీక్షల్లో ఉత్తీర్ణులైన 30 మంది క్యాడెట్లకు ఎ-సర్టిఫికెట్ల ప్రదానం చేశారు. కార్యక్రమానికి ఎన్‌సీసీ ఆర్మీ వింగ్ -25 ఆంధ్రా బెటాలియన్ సుబేదార్ సెంధిల్‌కుమార్, హవాల్దార్ హరికృష్ణ హాజరయ్యారు. హెచ్‌ఎం ఐ కృష్ణానాయక్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఏఎన్‌వో షేక్ మహమ్మద్ రసూల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. –నాదెండ్ల

కలెక్టర్ విచారణ



మండలంలోని ముప్పాళ్ల గ్రామాన్ని బుధవారం కలెక్టర్ శివశంకర్ ఆకస్మికంగా వచ్చారు. ఈ సందర్భంగా ముప్పాళ్ల-1వ సచివాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం గ్రామం, బీసీ కాలనీలో ఓటర్లకు సంబంధించిన ఆరు ఫారం-7 దరఖాస్తులను ఇళ్లకు వెళ్లి విచారించారు. అనంతరం బీఎల్‌వోలకు సూచనలు చేశారు. ముప్పాళ్ల-1 సచివాలయాన్ని పరిశీలించి రికార్డులను పరిశీంచారు. మండల స్పెషల్ ఆఫీసర్ వరలక్ష్మి, ఎంపిడివో రంగనాయకులు, ఈవోపీఆర్‌డీ వెంకటేశ్వర్లు, ఏఈ శ్రీలత, ఏఈవో అప్పారావు, హైమావతి పాల్గొన్నారు. –ఈపూరు

పరిశీలన పూర్తి



ఓటర్ల జాబితా రీవెరిఫికేషన్ సర్వే బుధవారంతో ముగిసింది. సాతులూరు, గణపవరం గ్రామాల్లో చిలకలూరిపేట ఈఆర్‌వో వసంతబాబు తనిఖీ చేశారు. చిరుమామిళ్లలో మండల ప్రత్యేకాధికారి బీజే బెన్ని, కనపర్రు, ఇర్లపాడు, అమీన్‌సాహెబ్‌పాలెం, అప్పాపురం గ్రామాల్లో తహసీల్దార్ ఎన్.నాగమల్లేశ్వరరావు సర్వేను పరిశీలించారు. గత మూడు రోజులుగా మండలంలోని ప్రతి గ్రామంలో 57 పోలింగ్ బూత్‌ల పరిధిలో బీఎల్‌వోలు, ఐదుగురు సూపర్‌వైజర్లు రీవెరిఫికేషన్ చేసి తుది జాబితాను బుధవారం ఎన్నికల అధికారికి అందించారు. –నాదెండ్ల

కూరగాయల మార్కెట్‌కు భూమిపూజ

- రెండు నెలల్లో షాపులను పూర్తి చేస్తాం
- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



కూరగాయల మార్కెట్ షాపింగ్ కాంప్లెక్స్‌కు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో వైఎస్సార్ కూరగాయల మార్కెట్ షాపింగ్ కాంప్లెక్స్‌కు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు బుధవారం భూమి పూజ, శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. కూరగాయల మార్కెట్ షాపుల యజమానులు, మున్సిపల్ కౌన్సిలర్ల సమక్షంలో 62 షాపుల కాంప్లెక్స్ నిర్మాణం జరుగుతున్నట్లు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ వినుకొండలో దశాబ్దాల నుంచి కూరగాయల మార్కెట్ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వ్యాపారుల సమస్యలను గుర్తించి ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సహాయ సహకారాలతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. పార్టీలకతీతంగా అన్నివర్గాల వారికి షాపులను కేటాయించినట్లు చెప్పారు. రెండు నెలల్లో షాపులను నిర్మించి శివయ్యస్థూపం సెంటర్ నుంచి కూరగాయల మార్కెట్‌ను విశాలమైన స్థలంలోకి మారుస్తామన్నారు. వినుకొండలో అన్నివిధాలా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుంటే మాజీ ఎమ్మెల్యే జీవీ కోర్టుల్లో కేసులు వేస్తూ అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. కూరగాయల మార్కెట్ నిర్మాణాలు నిర్మిస్తున్నామని చెప్పి రాత్రికి రాత్రే కోర్టులో కేసులు వేసినట్లు తెలిపారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా చట్టప్రకారం షాపులను నిర్మించి తీరుతామన్నారు. వివాదాలకు తావు లేకుండా వ్యాపారులందరూ కలసిగట్టుగా నిర్మాణాలను చేసుకోవాలని సూచించారు. వినుకొండ అభివృద్ధిని చూసి ఓర్వలేక మాజీ ఎమ్మెల్యే జీవీ అడ్డంకులు సృష్టిస్తున్నారని, ప్రజలు అంతా గమనిస్తున్నారన్నారు. త్వరలోనే వినుకొండలో ట్రామాకేర్ హాస్పటల్, ఈపూరు మండలంలో రూ.6 కోట్ల నిధులతో ఆసుపత్రి నిర్మాణాలు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు.

కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు తెల్లాకుల రాజేష్ ఖన్నా, బేతం గాబ్రియేలు, మున్సిపల్ కమిషనర్ వెంకయ్య, కౌన్సిలర్లు షకీలా దస్తగిరి, పాపసాని బ్రహ్మయ్య, నంది నరసింహారావు, రెడ్డి నాగపద్మ, నూజెండ్ల ఎంపీపీ మేడం జయరామిరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గంధం బాలిరెడ్డి, నూజెండ్ల జెడ్పీటీసీ జడ్డా సుబ్బులురామయ్య, మాజీ ఎంపీపీ ములకా రామతులసిరెడ్డి, పార్టీ నాయకులు నక్కా నాగిరెడ్డి, పులిపాటి రామారావు, బద్దెపూడి బ్రహ్మయ్య, ఎం.వి.ఎస్.ఎల్. మూర్తిలతో పాటు కూరగాయల మార్కెట్ వర్తకులు పాల్గొన్నారు.

వినూత్నంగా రక్షాబంధన్



కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, ఎంఈవో

శావల్యాపురం: స్థానిక ఎంఈవో కార్యాలయం ప్రాంగణంలో వినూత్నంగా రక్షాబంధన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం శ్రీ రామా పబ్లిక్ స్కూలు విద్యార్థులు చెట్టుకు రాఖీ కట్టి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో పుసులూరి లలితాకుమారి మాట్లాడుతూ చెట్లకు మన రక్షణ, ప్రకృతి మనకు రక్ష అంటూ విద్యార్థులు చేపట్టిన కార్యక్రమం పలువురుకు ఆదర్శమన్నారు. నేటి సమాజంలో మానవళి అందరు మొక్కలను నాటి తదుపరి వాటిని సంరక్షణ చేయాలన్నారు. చెట్లు మనకు ప్రాణ వాయువును అందిస్తూ సమస్త జీవరాశులను మనుగడకు దోహదపడతాయన్నారు. అనంతరం వృక్షో రక్షిత రక్షితం అంటూ నినాదాలు చేసి ప్రాంగణంలో చెట్లకు రాఖీలు కట్టారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్, ఈపూరు మార్కెట్ యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు, పాఠశాల కరస్పాండెంట్ కె.వి.ఆర్. మోహన్‌చందు, డైరెక్టరు అజిత్‌చంద్, ప్రిన్సిపాల్ కె. రత్నకుమారి, సీఆర్‌పీ రావూరి శివప్రసాదు, శ్రీహరి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర ఉత్పత్తులు



ప్రకృతి వ్యవసాయ రైతులతో బృందం సభ్యులు, డీపీఎం అమలకుమారి

నరసరావుపేట రూరల్: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ఆరోగ్యకరమైన ఉత్పత్తులను సాధించవచ్చని ఇండో జర్మన్ గ్లోబల్ అకాడమీ ఫర్ రీసెర్చ్ అండ్ లెర్నింగ్ సభ్యులు తెలిపారు. ప్రకృతి వ్యవసాయ విధానాలు పాటిస్తూ రైతులు సాగు చేస్తున్న జిల్లాలోని వ్యవసాయ భూములను బుధవారం రీసెర్చ్ అండ్ లెర్నింగ్ సభ్యులు గుల్జార్, పి.శాలినీలు సందర్శించారు. నరసరావుపేట మండలంలోని దొండపాడు, పిడుగురాళ్ల మండలంలోని గుత్తికొండ, నకరికల్లు మండలంలని నకరికల్లు గ్రామాల్లోని వరి, పత్తి, మిరప పంటలను సభ్యులు పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల అనుభవాలను వీరు అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఇండో జర్మన్ గ్లోబల్ అకాడమీ ఫర్ రీసెర్చ్ అండ్ లెర్నింగ్ సభ్యులు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానాలను పాటిస్తూ పంటలను పండించడం ద్వారా ఆరోగ్యకరమైన ఉత్పత్తులను అందించే దిశగా సిబ్బంది, రైతులు పనిచేయడం అభినందనీయమన్నారు. రైతు సాధికారిక సంస్థ రీజనల్ కోఆర్డినేటర్ వెంకట్రావు మాట్లాడుతూ ప్రధాన పంటలైన పత్తి, మిరప పొలాల్లో అంతర్ పంటలుగా క్యారెట్, బీట్రూట్, ముల్లంగి, కంది, దోస, ఉల్లి, బీర, బెండ, చిక్కుడు, టమోటా పంటలను సాగు చేసుకోవాలని తెలిపారు.

దీని ద్వారా సంవత్సరం పొడవునా రైతుకు ఆదాయంతో పాటు ఆరోగ్యకరమైన ఉత్పత్తులను అందించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డీపీఎం అమలకుమారి, ఏడీపీఎం వి.ప్రేమరాజ్‌లు పాల్గొన్నారు.

శ్రీనివాసునికి వెండి కిరీటం



వెండి కుండ కిరీటం అందచేసిన ఆలయ మాజీ జనరల్ సెక్రటరీ డివి అప్పారావు

వినుకొండ టౌన్: పట్టణంలోని శ్రీనివాస నగర్‌లో వెలసిన శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో 37వ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. రెండవ రోజు బుధవారం కళ్యాణ వేడుకలు వైభవంగా చేపట్టారు.ఈ కల్యాణ వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ముఖ్యఅతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. అదేవిధంగా ఆలయ మాజీ జనరల్ సెక్రటరీ డీవీ అప్పారావు కుటుంబ సభ్యులు భార్య అరుణ, కుమారుడు రవిచంద్ర, కోడలు సింధులతో కలిసి, స్వామి వారికి రెండున్నర కిలోల వెండి కుండ కిరీటం అందచేశారు. అనంతరం భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలను ఆలయ అర్చకులు శ్రీనివాసులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు రెడ్డి బంగారయ్య, సెక్రటరీ అచ్యుత కృష్ణ సుబ్బారావు, కోశాధికారి కాళ్ళ రామ కోటేశ్వరరావు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

జగనన్న పాలవెల్లువ రుణమేళా



శావల్యాపురం సదస్సులో మాట్లాడుతున్న డీఎల్‌డీవో



ఈపూరు మండలంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ రామారావు

ఈపూరు: మండలంలోని ఇనిమెళ్ల, చిట్టాపురం గ్రామాల్లో జగనన్న పాలవెల్లువ కార్యక్రమంలో భాగంగా రుణమేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డిప్యూటీ డైరెక్టర్ రామారావు మాట్లాడుతూ జగన్న పాలవెల్లువ కార్యక్రమం మహోన్నతమైన కార్యక్రమమని, ఈ కార్యక్రమం ద్వారా పాడి రైతులు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్నవారికి త్వరలోనే రుణాలు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. లబ్ధిదారులు కూడా ఇందుకు పూర్తిస్థాయి సహాయ సహకారాలు అందిస్తే తమవంతు సహకారం అందిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమాల్లో మండల ప్రత్యేకాధికారి వరలక్ష్మి, ఎంపీడీవో రంగనాయకులు, అసిస్టెంట్ డైరెక్టర్లు నరసింహులు, శ్రీనివాసమూర్తి, ఎం. సునీత తదితరులు పాల్గొన్నారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: మండలంలోని పిచికలపాలెం, చినకంచర్ల, గుంటుపాలెం, గ్రామాల్లో జగనన్న పాలవెల్లువ కార్యక్రమంపై అమూల్ పాల ఉత్పతిదారులతో అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటుపాలెం గ్రామసచివాలయంలో జరిగిన సదస్సులో డీఎల్‌డీవో యం.వెంకటరెడ్డి పాల్గొని మాట్లాడుతూ సొసైటీ బ్యాంకు ద్వారా అందించే రుణాలను పాడిరైతులకు సద్వినియోగం చేసుకోని ఆర్థిక ప్రగతి సాధించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, పశువైద్యాధికారులు సోముల గుణధీర్, పాలపర్తి గణేష్‌కుమార్, ఏఈవో పురేటి అశోక, కార్యదర్శి చింతా శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



వెల్లటూరు సచివాలయంలో జగనన్న పాలవెల్లువలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి

బొల్లాపల్లిలో...

బొల్లాపల్లి: మండలంలోని వెల్లటూరు, పేరూరుపాడు, మూగచింతలపాలెం సచివాలయాలు మండల ప్రత్యేక అధికారి ఎస్.ఓబులనాయుడు బుధవారం సందర్శించారు. పిఎం కిసాన్, సీసీఆర్‌సీ కార్డులు, జగనన్న పాలవెల్లువ, అసంపూర్తి సచివాలయాల భవనాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ పీఎం కిసాన్ పథకం వర్తించాలంటే లబ్ధిదారులు ఈకెవైసీ తప్పనిసరని చెప్పారు. జీడీసీసీ బ్యాంకు ద్వారా మహిళలకు పాడిపై రుణసౌకర్యం కల్పిస్తామన్నారు. బూత్‌లెవల్ అధికారులు సర్వేపై క్లయిమ్స్ విచారణపై పర్యవేక్షించారు. మండలంలోని అసంపూర్తిగా ఉన్న సచివాలయాలు ఆర్‌బికె హెల్త్ సెంటర్ భవనాలు త్వరలో పూర్తి చేయాలని తెలిపారు. ఏవో అంకారావు, పలుశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రొంపిచర్లలో ముగిసిన పోలేరమ్మ తల్లి జాతర

రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్ల పడమటిపాలెంలో గ్రామ దేవతలైన పోలేరమ్మ తల్లి, అద్దంకమ్మ తల్లి జాతర ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. మంగళవారం రాత్రి గ్రామ దేవత పోలేరమ్మ తల్లికి కుంకుమ బండ్ల ఉత్సవాలను నిర్వహించారు. ట్రాక్టర్‌లను విద్యుత్ కాంతులతో అలంకరించి బండి వెంట బండి బయలు దేరి పోలేరమ్మ తల్లి దేవాలయం చుట్టూ ప్రదక్షణలు నిర్వహించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. బుధవారం జాతర ముగింపు కార్యక్రమాన్ని పురస్కరించుకొని విందు కార్యక్రమాలను నిర్వహించుకున్నారు. జాతర సందర్భంగా బంధువర్గాలు రావటంతో సందడి నెలకొంది. ఈ సందర్భంగా పోలేరమ్మ తల్లి అమ్మవారు, అద్దంకమ్మ అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు.

ఫ్యామిలీ వైద్యాధికారి సేవలు పొందాలి



తుమ్మలకుంటలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా వైద్యాధికారి జి.శోభారాణి

శావల్యాపురం: ఫ్యామిలీ వైద్యాధికారి పేదలందరు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యాధికారిణి జి.శోభారాణి అన్నారు. బుధవారం మండలంలోని కొత్తలూరు గ్రామపంచాయతీ శివారు గ్రామమైన తుమ్మలకుంట గ్రామంలో జరుగుతున్న ఫ్యామిలీ వైద్యాధికారి కార్యక్రమాన్ని డీఎంహెచ్‌వో ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే రోగుల ఇళ్లను నేరుగా వైద్యాధికారి సందర్శించి వైద్యసేవలతో పాటు రోగికి ఆరోగ్య భరోసా కల్పించి ఉచితంగా మందులు ఇస్తామన్నారు. అలాగే అంగన్‌వాడీ సెంటర్లు సందర్శించి గర్భిణులు, బాలింతలు, చిన్నారులు రక్తహీనతకు గురికాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి మాణ్యం రాధాకృష్ణన్, ఎంఎల్‌హెచ్‌పీ పృధ్వీరాణి, ఆరోగ్య కార్యకర్త ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

వారంలో ఆన్‌లైన్ పెండింగ్ ఓట్లను నమోదు చేయాలి



సమీక్షలో సూచనలిస్తున్న తహసీల్దార్ సుజాత

యడ్లపాడు: ఆన్‌లైన్ చేయాల్సిన ఓటర్ల పెండింగ్‌ను వారంలోగా పూర్తి చేయాలని సహాయ ఎన్నికల అధికారి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ జి సుజాత చెప్పారు. యడ్లపాడులోని సచివాలయం-1లో బీఎల్‌వోలతో మంగళవారం ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె బీఎల్‌వోలతో మాట్లాడుతూ ఓటర్ల జాబిత ఇంటింటి పరిశీలన ప్రక్రియ యడ్లపాడు మండలం పరిధిలో వందశాతం పూర్తి చేశామన్నారు. మండలంలో 57 పోలింగ్ కేంద్రాల పరిధిలో మొత్తం 44,192 మంది ఓటర్లు ఉన్నాయన్నారు. అందులో పురుషులు 21,450 మంది ఉండగా, 22,742 మంది మహిళా ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఇంటింటి సర్వే ప్రక్రియలో భాగంగా గుర్తించి 4,197 వివిధ రకాల క్లయిమ్‌లను వేగవంతంగా పునః పరిశీలన చేయాలని సూచించారు. అలాగే ఇంకా ఆన్‌లైన్ పెండింగ్ ఉన్న 1977 ఓటర్ల నమోదును వారం రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటర్ల తుది జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా పారదర్శకంగా చేపట్టి స్వచ్ఛ ఓటర్ల జాబితాను రూపొందించేందుకు బీఎల్‌వోలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్యామలత, సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

చిలకలూరిపేట: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని తెలిపారు. మైలవరపు గుండయ్య కౌన్సిల్ హాలులో నిర్వహించే ఈ సమావేశానికి కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు హాజరుకావాలని కోరారు.